## ఎన్నికల నియమావళిని పాటించాలి

● అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి మయాంక్ మిట్టల్

మక్తల్‌టౌన్, అక్టోబర్19: ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలని మక్తల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. గురువారం మక్తల్ తాసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల నియమావళిపై పలుసూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రచారానికి తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. అభ్యర్థులు కార్యాలయానికి వచ్చే సమయం లేకపోతే సీవిజిల్ యాప్ ద్వారా అనుమతులు పొందే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించే వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి ఓటరుకూ ఓటర్ స్లిప్ చేరేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం రాజకీయ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలోమాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ప్రచార సమయంలో వైరానికి వెళ్లకుండా సానుకూల వాతావరణంలో ప్రచారం నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ సువర్ణరాజ్, సీఐ రామ్‌లాల్, వివిధ పార్టీ నాయకులు మహిపాల్‌రెడ్డి, నాగప్ప, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తాసీల్దార్

మాగనూర్, అక్టోబర్ 19: మండలంలోని వడ్వాట్, కొల్పూర్, మందిపల్లి పర్మన్ దొడ్డి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం తాసీల్దార్ సతీశ్ కూమార్ పరిశీలించారు. ఈసందర్భంగా బూత్ అధికారులతో మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులకు టెంట్లు, ర్యాంప్‌లు ఏర్పాటు చేసి వారు కూర్చునేందుకు కుర్చీలు ఇతర సామాగ్రి సమకూర్చాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించి రాజకీయాలకు తావు లేకుండా అధికారులకు అందుబాటులో ఉంటూ ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీశైలం, అయా గ్రామాల వీఅర్ఏలు పాల్గొన్నారు.

# శరవేగంగా..

◆ కొనసాగుతున్న పీజేపీ రోడ్డు పనులు
◆ ఆరు గ్రామాల ప్రజలకు తీరనున్న ప్రయాణ కష్టాలు



కొనసాగుతున్న మస్తీపూర్, కృష్ణంపల్లి రోడ్డు పనులు

అమరచింత, అక్టోబర్ 19: మండలంలోని మాస్తీపూర్ గ్రామం నుంచి కృష్ణంపల్లిగ్రామం మీదుగా నందిమళ్ల ఎక్స్ రోడ్డు వరకు నాలుగు కిలోమీటర్ల వరకు చేపట్టిన ప్రియదర్శిని జూరాలప్రాజెక్టు ( పీజేపీ )రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పీజేపీ నందిమల్ల చౌరస్తా నుంచి నందిమల్ల గ్రామం మీదుగా ఆత్మకూర్ మండలం మూలమల్ల వరకు, మస్తీపూర్ క్రాస్ రోడ్డు నుంచి ప్రాజెక్టు వరకు నందిమల్ల, నందిమల్ల ఎక్స్ రోడ్డు, కృష్ణంపల్లి, చంద్రఘడ్, మస్తీపూర్ గ్రామల ప్రజల ప్రయాణ ఇబ్బందులు తొలగించేందుకు బీఆర్ఎస్ ప్రభు త్వం రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసింది. రోడ్డు నిర్మా ణానికి అన్‌లైన్ ద్వారా టెండర్ దక్కించుకున్న గుత్తేదారు పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహ న్‌రెడ్డి చొరవతో మరో సారి అన్‌లైన్ ద్వారా టెండర్లు పలిచి పనుల్లో వేగం పెంచేలా చేశారు. దీంతో మొదటి విడుతలో మస్తీపూర్ క్రాస్‌రోడ్డు, మస్తీపూర్ వరకు మూడు కీలోమీటర్లు తారు రోడ్డు పనులు పూర్తి చేశారు. రెండో విడుత మస్తీపూర్ నుంచి కృష్ణంపల్లి వరకు రూ.3కోట్లతో చేపట్టిన రోడ్డు పనులు మరో వారం రోజుల్లో పూర్తి అయ్యేలా శరవేగంగా కొనసాగుతున్నాయి. దీంతో మస్తీపూర్, నందిమల్ల, చంద్రఘడ్, కృష్ణంపల్లి, నందిమల్ల ఎక్స్ రోడ్డు తో పాటు జూరాల ప్రాజెక్టు మీదుగా గద్వాల్, రాయిచూర్ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోనున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### అధికారులు పర్యవేక్షించాలి



ప్రభుత్వం ప్రజల ప్రయాణ కష్టాలు తీర్చేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేసి రోడ్లు నిర్మిస్తుంటే అధికారుల నిర్లక్ష్యంతో గుత్తేదారు పనులు నాణ్యతగా చేపట్టడంలేదు. రోడ్డు నిర్మాణ పనులను అధికారులు పర్యవేక్షించాలి లేకుంటే ప్రభుత్వ ఆశయం నీరుగారిపోంతుంది. ఏండ్ల తరబడి ఉండాల్సిన రోడ్డు మూడునాళ్లకే పాడైపోతుంది. పీజేపీ రోడ్డు నిర్మాణంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–కురుమన్న , బీఆర్ఎస్ నాయకుడు, కృష్ణంపల్లి

### ఐదు నిమిషాల్లో చేరుకుంటాం



మస్తీపూర్ నుంచి కృష్ణంపల్లి వరకు వేస్తున్న రోడ్డు పనులు పూర్తైతే మండల కేంద్రానికి ఐదు నిమిషాల్లో చేరుకుంటాం. ఆర్ ఆర్ సెంటర్‌గా ఉన్న మాగ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారు. నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పుడు మస్తీపూర్ క్రాస్ రోడ్డు నుంచి గ్రామం వరకు రోడ్డు పనులు చేపట్టారు. దీంతో ప్రయాణ కష్టాలు తీరుతాయి.

– మేకల సుధాకర్, కృష్ణంపల్లి గ్రామం

## ఎమ్మెల్యే చిట్టెం వెంటే ఉంటాం

● కురుమ సంఘం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నర్వ, అక్టోబర్19: ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహ న్‌రెడ్డి వెంటే ఉంటామని కురుమ సంఘం నాయకులు శేఖర్‌యాదవ్, బీ.కే. నర్సింహ,శివ, నాగరాజు తదితరులు స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలోని కొందరు తమ స్వార్థంతో తమ కులస్తులను బీఆర్ఎస్ పార్టీకి దూరం చేసేవిధంగా చేస్తున్నారని వారిని నమొద్దన్నారు. మాదాసి, మాదారి కురుమలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా నిలుస్తూనే ఉందన్నారు. కొందరు తమ స్వార్థం కోసం ప్రభుత్వంపై బురుదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 65 ఏండ్లుగా ఏప్రభుత్వం కూడా కురుమ కులస్తులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కురుమ కులస్తులు సామాజిక, రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం, ఎమ్మెల్యే చిట్టెం రాంమ్మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారన్నారు. గొర్రెల యూనిట్ల ద్వారా ఉపాధి చూపుతుంటే కొందరు యూనిట్లు తీసుకోనివ్వకుండాఅడ్డు పడ్డారన్నారు. అలాంటి వారి మాయమాటలు నమ్మొదన్నారు. ఎమ్మెల్యే చిట్టెం గెలుపుకోసం ప్రతి ఒక్కరం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో కుర్వ సంఘం నాయకులు చిన్న కిష్టన్న, లింగన్న, మల్లేశ్, రాజేశ్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం


ఆత్మకూరు, అక్టోబర్ 19: మండల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించన్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ గురువారం ప్రకటనలోతెలిపారు. స్థానిక సాయితిరుమల కల్యాణమండపంలో నిర్వహించనున్న సమావేశానికి ముఖ్యఅథితిగా ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి హాజరుకానున్నారని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ కమిటీల సభ్యులు కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు విధిగా సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

## నిబంధనలు పాటించాలి

నర్వ, అక్టోబర్19: ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిబంధనలు పాటించా లని ఎస్సై సీఎచ్.కురుమయ్య సూచించారు. గురువారం ఆయన స్థానిక విలేకర్ల తో మాట్లాడుతూ వచ్చే నెల అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్దంగా పని చేస్తే కేసులు నమోదు చేసి శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రెండురోజుల క్రితం నిబంధనలు పాటించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో శరన్నవరాత్రోత్సవాలు

మక్తల్ అర్బన్,అక్టోబర్19: శరన్నవరాత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గురువారం మక్తల్ పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీమాత దుర్గాదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆర్యవైశ్య మహిళలు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. అనంతరం పిల్లలు, మహిళలకు ఆడాళ్ల మజాక గేమ్స్ నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



నర్వలో అన్నపూర్ణాదేవీ అలంకరణలో..

### కృష్ణ మండలంలో...

కృష్ణ, అక్టోబర్ 19 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామతను గురువారం వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధామహాదేవ్, బీఆర్ఎస్ నాయకులు శంకర్‌నాయక్, ఆంజనేయులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో త్రిపురాసుందరీదేవీగా అమ్మవారు

### నర్వలో...

నర్వ, అక్టోబర్19: మండలంలోని నర్వ, లంకాల, కల్వాల, సీపూర్, బెక్కర్‌పల్లి, జంగంరెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం 5వ రోజూ అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. లంకాల గ్రామంలోని బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నిర్వాహకులు, గ్రామ పెద్దలు, మహిళలు, భజనమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### శాకాంబరీ దేవీగా...

ఆత్మకూరు, అక్టోబర్ 19: మండల కేంద్రంలో స్వర్ణకారసం ఘం ఆధ్వర్యంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన మండపంలో దుర్గాదేవిని గురువారం శాకాంబరీ దేవీగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు పార్వతీ దేవీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. హనుమాన్‌నగర్ స్పటిక లింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన మండపంలో అమ్మవారు మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. కోట్ల ఆంజనేయస్వామి ఆలయం, మల్లాపురం ఆంజనేయస్వామి ఆలయాల్లో నెల కొల్పిన దుర్గామతకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మండపాల వద్ద మహిళలు బతుకమ్మలతో ఆడిపాడారు.



ఆత్మకూర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

### అమరచింతలో...

అమరచింత, అక్టోబర్ 19: మండలంలో వివిధ గ్రామా ల్లో ఏర్పాటు చేసిన మండ పాల్లో గురువారం అమ్మవారు లలితా త్రిపురసుందరీ దేవీగా భక్తులకు దర్శనమిచారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నెలకొల్పిన అమ్మవారి మండ పం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేసి బతుకమ్మలతో ఆడిపాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.